తునికాకు సేకరణ ప్రారంభం

బెజ్జూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ గురువారం ప్రారంభమైంది. బెజ్జూరు రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో తునికాకు సేకరణ ప్రారంభం కావడంతో రైతులు, కూలలు ఉదయమే అటవీ ప్రాంతానికి వెళ్లి తునికాకు సేకరించి కట్ట లు కట్టి కల్లాల్లో విక్రయించారు. తునికాకు సేకరణతో కూలీలకు ఉపాధి కలుగుతుం డడంతో కూలీలంతా సేకరణ కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి సేకరించారు.

కేక్ కట్ చేసిన నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. . ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, కోట్నాక విజయ్‌లతో పాటు మండలాల అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌యాదవ్, సొల్లు లక్ష్మీ, పెంటయ్య, ప్రసాద్‌గౌడ్, జయరాజ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ల విడుదల

కౌటాల, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 20న చేపట్టనున్న సమ్మె పోస్టర్లను సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణమాచారి, శారద, లక్ష్మీ, నిర్మల, మాయ, పోశక్క తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసంపై ఆశలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- ఇంటర్వ్యూలకు హాజరవుతున్న యువత
- ధ్రువపత్రాలు పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్న అధికారులు
- జిల్లాలో 28,116 మంది దరఖాస్తులు
- జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

చింతలమానేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పేరిట ఆర్థిక సాయం అందజేసి వారు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ వర్గాల ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించింది. అర్హుల ఎంపిక కోసం జిల్లాలోని అన్ని మండలాల్లో అధికార యంత్రాంగం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తిస్తున్నాయి. గత నెల 14వ తేదీ వరకు ధరఖాస్తులు స్వీకరించారు. 28వ తేదీ నుంచి ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల పత్రాలు పరిశీలిస్తున్నారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావం రోజున అర్హులైన వారికి మంజూరు పత్రాలు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. దీంతో యువతలో ఆశలు రెకెత్తిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో అన్ని వర్గాల ప్రజల నుంచి 28,116 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కార్పొరేషన్‌ల వారీగా ఎస్సీ 6,836 మంది, ఎస్టీ 7,233 మంది, బీసీ 12,096 మంది, మైనార్టీ 1,918 మంది, క్రిస్టియన్ 33 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ. 50వేల నుంచి రూ. 4లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొన్నది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో పురపాలక కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోల అధ్యక్షతన ప్రత్యేక కమిటీల బాధ్యులు దరఖాస్తులు స్వీకరించారు. వారి ఆధ్వర్యంలో ప్రస్తుతం అన్ని మండలాల్లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల నుంచి పత్రాలు పరిశీలించి అర్హులను గుర్తించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

ఉపాధి యూనిట్ల కోసం రుణ మంజూరు అవకాశం కోసం బ్యాంకర్ల సమక్షంలో ఈ పరిశీలన జరుగుతున్నది. అర్హుల జాబితాను జిల్లా కమిటీకి నివేదించనున్నారు. జిల్లా కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్, అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా ఆర్డీవో, సభ్యులుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సంక్షేమాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ తదితరులు ఉంటారు. వీరు అర్హుల తుది జాబితాను ప్రకటిస్తారు. పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు పత్రాలు అందజేయడంతో పాటు, యూనిట్ల వారీగా రెండువారాలు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటారు. కార్పొరేషన్ల వారీగా ఎన్ని యూనిట్లు కేటాయిస్తారో అన్న అనుమానాలు యువతలో ఉన్నాయి. దీనికి సంబంధించి త్వరలోనే ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ అవుతాయని అధికారులు చెబుతున్నారు.

యూనిట్ల వారీగా ఇలా..

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు యూనిట్ల వారీగా అర్థిక సాయం అందజేయనున్నారు. యూనిట్-1 కింద రూ. 50వేలు దీనికి వంద శాతం రాయితీ వర్తిస్తుంది. యూనిట్-2 కింద రూ. లక్ష వరకు ఇవ్వనుండగా ఇందులో 90శాతం సబ్సిడీ, యూనిట్-3 కింద రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు ఇవ్వనున్నారు. ఇందులో 80శాతం సబ్సిడీ, యూనిట్-4 కింద రూ. 2లక్షల నుంచి 4 లక్షల వరకు ఇవ్వనుండగా ఇందులో 70 శాతం సబ్సిడీ ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం కోసం మీసేవా లేదా ఆన్లైన్‌లో ధరఖాస్తు ఫారం, దానికి జత చేసిన ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రం, బ్యాంక్ పుస్తకం తీసుకొని అధికారులు నిర్వహించే పరిశీలనకు సంబంధిత అభ్యర్థి హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అధికారులు అర్హులైన వారికే రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



ఇంటర్వ్యూకు తరలివచ్చిన దరఖాస్తుదారులు(ఫైల్)

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆసిఫాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, పిల్లలు, తల్లితండ్రులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే వారి వివరాలను 8712670551కు తెలియజేయాలని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిస అయినట్లయితే వారిని డి అడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు స్వీకరించినా, రవాణా చేసినా వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్య త్‌ను నాశనం చేసుకుంటుందన్నారు. దాని వల్ల వారి జీవితాలు విచ్ఛిన్నం కావంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఎస్పీ తెలిపారు.

శివాజీ పేరు చిరస్మరణీయం



శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, మే 8 (ఆంధ్రజ్యోతి): శివాజీ పేరు చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. దహెగాం మండలం అయినం గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆరెకులస్తులతో కలిసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ వారసులైన ఆరెకులస్తుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దహెగాంలో ఆరెకులస్తుల క్షేమ భవనం కోసం నిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. అంతకు ముందు మహిళలు మంగళహారతులతో తరలి రాగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, టి.శ్రీరామరావు, రమేష్, నారాయణ, అశోక్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిర్పూర్(టి), మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల గురువారం పది క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. సిర్పూర్(టి), కౌటాల మండలాల్లో సేకరించి మహారాష్ట్రకు గురువారం ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను మండలంలోని పారిగాం గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ మేరకు ముంజంకార్ ప్రేంసాగర్, జాడి అశోక్‌లతో పాటు మహారాష్ట్రకు చెందిన వ్యాపారి చౌదరి మోరేశ్వర్‌లపై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో జోర్‌పల్లి గ్రామం నుంచి రేషన్ బియ్యం తర లిస్తున్నట్లు అందిన సమాచారం మేరు దాడి చేసి ఆరున్నర క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన అనురాధ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి హాజరు



రాధాకృష్ణాచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో గురువారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆసిఫాబాద్ కవుల సంఘం ప్రచార కార్యదర్శి రచయిత, జర్నలిస్టు చిలుకూరి రాధాకృష్ణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత గానం చేసి ప్రముఖ కవు లచేత ప్రశంసలు అందుకున్నారు. ఈ సంద ర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, లక్ష్య సాధన సమితి చైర్మన్ ప్రజ్ఞరాజ్, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడే సాబ్ ఆయనను సన్మానించారు

వాలీబాల్ కిట్ అందజేత

కెరమెరి, మే 8 (అంధ్రజ్యోతి): మండలంలోని మురికిలొంకలో ఎస్సై మధుకర్ యువతకు గురువారం వాలీబాల్ కిట్‌ను, టీషర్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికిలొంకం, పార్డలాంటి మారుమూల గ్రామాల్లో కొందరు నకిలీ పత్తి విత్తనాలు విక్రయి స్తున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. పత్తి విత్తనాలు వ్యవసాయాధి కారులు ధ్రువీకరంచిన దుకాణంలోనే కొనుగోలు చేయాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి గు రువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సీఎంఆర్ ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. పేద ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఈ పథకం కింద చికిత్స పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పెంచికలపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని పోతెపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన భూ భారతి సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకు తలపెట్టిన భూ భారతి సదస్సుల్లో అర్జీదారుల నుంచి భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించనున్నామని చెప్పారు. పరిశీలించి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుం టామని అన్నారు. దీనికి సంబంధిత మండలం లోని మూడు బృందాలు ఏర్పాటు చేసి దరఖా స్తులు స్వీకరిస్తామని తెలిపారు. పెండింగ్, సాదాబైనామాలు పరిష్కరిస్తామని అన్నారు. దరఖాస్తుల స్వీకరించి రశీదు జారీ చేయడంతో పాటు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి ధాన్యం, తెలంగాణ నుంచి రాయితీ బియ్యం తరలించకుండా తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని గురువారం వెంకట్రావుపేట వద్ద అంతరాష్ట్ర రహదారిపై చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఇరువైపులా వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విస్తృత తనిఖీలు చేపట్టి రాయితీ బియ్యం, వరి ధాన్యం తరలిస్తే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది రాత్రి, పగలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



దరఖాస్తుదారుల సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ డేవిడ్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణికి సన్మానం



ధనలక్ష్మిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్

ఆసిఫాబాద్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన జైనూరు మండలం మార్లవాయికి చెందిన ఆత్రం ధనలక్ష్మిని గురువారం పలువురు సన్మానించారు. ధనలక్ష్మి 9వ తేదీ నుంచి 11 వరకు తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించే హెచ్‌ఎం140 సౌత్ జోన్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నదని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు అరిగెల మల్లికార్జున్‌యాదవ్, జూడో అసోసి యేషన్ జిల్లా అధ్య క్షుడు శరత్, జిల్లా క్రీడల ఆఫీసర్ మీనారెడ్డి, జిల్లా యు వజన క్రీడల అధికారిణి రమాదేవి, కోచ్‌లు అరవింద్, రాకే ష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నికపై పిటిషన్.. సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో పలు అంశాలను దాచిపెట్టారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఈ అంశంలో లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేకు వారం రోజుల గడువు ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నిక లప్పుడు దాఖలు చేసిన అఫిడవిట్‌లో కోవ లక్ష్మి ఐటీ రిటర్న్ పొందు పరచలేదని కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యామ్‌నాయక్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్‌కేసింగ్‌తో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం గురువారం ఈ పిటిషన్‌పై గంటకు పైగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడ్డారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం ఆమె ఎన్నిక చెల్లదని వాదించారు. ఎమ్మెల్యే తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సమగ్ర వివరాలతో రాతపూర్వకంగా కోర్టుకు వాదనలను సమర్పిస్తామని అభ్యర్థించారు. ధర్మాసనం వారం రోజుల్లో రాతపూర్వకంగా వాదనలు సమర్పించేందుకు ఎమ్మెల్యే కోవ లక్ష్మికి అవకాశం ఇచ్చింది. ఈ పిటిషన్‌పై విచారణ ముగిస్తూ తీర్పును రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నది.

మార్కుల లెక్కింపునకు అవకాశం

జవాబుపత్రాలనూ పొందవచ్చు

దరఖాస్తులకు 15వ తేదీ గడువు

వాంకిడి, మే 8 (ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో పరీక్ష తప్పిన వారు, ఉత్తీర్ణులైనా ఏదైనా సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చాయన్న నమ్మకంతో ఉన్న విద్యార్థులు మార్కులను మళ్లీ లెక్కించుకోవడానికి ప్రభుత్వం పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. జవాబు పత్రాలను పొందడంతో పాటు వాటిలో తక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తిస్తే మళ్లీ అదనంగా మార్కులు వేసేందుకు రీవెరిఫికేషన్ (పునఃపరిశీలన)కు అవకాశం కల్పించింది. చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేపకోవడంతో పరీక్షల విభాగం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. గడువులోగా నిర్ణిత రుసుము చెల్లించి మార్కుల లెక్కింపుతో పాటు జవాబు పత్రాల పునఃపరిశీలన చేయిం చుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్షలో తప్పిన విద్యార్థులు మారు ్కల లెక్కింపునకు దరఖాస్తు చేసినప్పటికీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవసరమైన ఫీజు చెల్లించాలి. పునఃపరిశీలన, మార్కుల లెక్కింపులో సానుకూలత లభించకుంటే మళ్లీ పరీక్ష రాసుకోవడానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఒక్కో సబ్జెక్టుకు..

మార్కుల లెక్కింపు కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు 500 రూపాయల చొప్పున ఈ నెల 15లోగా చెల్లించాల్సి ఉంటుంది. ఎన్ని సబ్జెక్టుల్లో మార్కులు లెక్కింపు చేసుకోవాలని కోరుకుంటారో వాటికి ఫీజు చెల్లించాలి. దరఖాస్తులను పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి తీసుకొని వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులను మాత్రమే లెక్కించి తప్పు ఉంటే సరిచేస్తారు. సమాధానాలు చూసుకునే అవకాశం ఉండదు.

పాఠశాల హెచ్‌ఎంకు..

విద్యార్థులు జవాబు ప్రతిని పొందడంతో పాటు పునఃపరిశీలన చేసేందుకు దరఖా స్తులను పూర్తి చేసి సంభందిత పాఠశాల హెచ్‌ఎంకు అందజేయాలి. రివెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలి. గ్రూప్ చలాన్ పద్ధతిలో కాకుండా ప్రతి అభ్యర్థికి విడిగా ఆన్‌లైన్‌లో హెచ్‌ఎం ద్వారా ఫీజు చెల్లించాలి. జవాబు పత్రం జిరాక్స్ ప్రతి కోసం దరఖాస్తు చేసుకుంటే మళ్లీ మార్కుల రికౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. పునఃపరిశీలన తరువాత సమాధాన పత్రం జిరాక్స్‌ను విద్యార్థికి పంపుతారు. వీటికి ఈ నెల 15 వరకు గడువు ఉందని ఎంఈవో శివచరణ్‌కుమర్ తెలిపారు.

ముందస్తుతో వసూలైంది.. రూ. 50 లక్షలే

కాగజ్‌నగర్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్సిపాలిటీల్లో కల్పించిన ఎర్లీ బర్డ్ పథకంలో కాగజ్‌నగర్‌లో కేవలం రూ. 50 లక్షలే వసూలయ్యాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో గత నెల 30 వరకు ఎర్లీ బర్డ్‌కు ఉన్న గడువు ఈనెల 7 వరకు పొడిగించారు. అయితే ఇప్పటి వరకు 50 లక్షల రూపాయలు వసూలు అయినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాజేందర్ తెలిపారు. ఈ పథకం కింద 5 శాతం రాయితీతో పన్నులు ముందుగానే చెల్లించవచ్చని మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రచారం చేపట్టారు. ఈ సంవత్సరం పట్టణంలో రూ. 50 లక్షల పన్ను వసూలైంది. గత నెల 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లించడానికి వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం మరోసారి పొడిగించింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 15,115 గృహాల నుంచి 3.49 కోట్లు మేర వసూలు కావాల్సి ఉండగా రూ. 50 లక్షలు వసూలు చేశారు. ఈ మేరకు 14.55 శాతం వసూలు అయినట్లు అధికారులు ప్రకటించారు.

‘ఎర్లీబర్డ్’కు స్పందన కరువు

కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో వ్యాపార, వాణిజ్య, నివాస గృహాలకు సంబంధించిన ఆస్తి పన్ను ముందుగానే చెల్లింపులు చేస్తే ఈ రాయితీ అందుతుందని విస్తృత ప్రచారం నిర్వహించారు. కానీ 5 శాతం రాయితీ దక్కాలంటే 2025-26 సంవత్సరం పన్ను ప్రస్తుతం చెల్లించాలి. పథకం పూర్తయితే పన్ను వసూళ్ల మొత్తం వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరం ఎలాంటి బకాయిలు లేని వారికి మాత్రమే ఎర్లీబర్డ్ పథకం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ పథకం కింద 15 శాతం మేర పన్ను వసూలు చేశారు. మరింత గడువు పెంచుతారా లేదా అనే విషయం ఇంకా స్పష్టత రాలేదని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాజేందర్ తెలిపారు. కాగా ఎర్లీ బర్డ్ పథకం కింద గత 2024-25 మున్సిపల్ పన్ను వసూలు రూ. 2.25 కోట్లు ఉండగా, 1.46 కోట్లు వసూలు చేశారు. దీంతో మున్సిపాలిటీకి భారీగానే ఆదాయం సమకూరింది. ఈ మేరకు 30 వార్డుల్లో ఎర్లీబర్డ్ పథకం కింద పన్నులు వసూలు చేపట్టారు. మున్సిపాలిటీ పరి ధిలో 3.93 కోట్లుకు గానూ గత సంవత్స రం 53 శాతం వసూలు కాగా ఈ ఏడాది ఎర్లీబర్డ్‌కు అంతగా స్పందన రాలేదు.

పిన్నారంలో పోడు సాగుపై వాగ్వాదం



గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

కోటపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నారం గ్రామంలో గురువారం ఇటు అటవీ అధికారులు అటు గ్రామస్థుల మధ్య ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ గ్రామానికి సమీపంలోని అటవీ శాఖ భూముల్లో గ్రామానికి చెందిన పలువురు పోడు వ్యవసాయం చేస్తున్నారని అటవీ అధికారులు వారి ఇండ్లలో చొరబడి ట్రాక్టర్లను, ఇతర వాహనాలను తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామస్థులంతా ఏకమై వారిని అడ్డుకున్నారు. ఫలితంగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడింది. అయితే ఈ గ్రామస్థులు పోడు వద్దన్నా పోడు సాగు చేస్తున్నారని అందుకే వాహనాలను సీజ్ చేసేందుకు ప్రయత్నించామని అటవీ అధికారులు అంటుండగా అటవీ అధికారులు అటవీ శాఖ భూములకు సంబంధించి బౌండరీ లైన్ పెట్టారని, వారి వేసిన ఫెన్సింగ్ దాటి వెళ్లడం లేదని, గతంలో ఎప్పుడో ఆ భూములను దున్నిన సందర్భంగా ప్రస్తుతం అటవీ అధికారులు ఇండ్లలో చొరబడడం, ట్రాక్టర్లను తీసుకువెళ్లడం న్యాయమేనా అని గ్రామస్థులు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలోనే బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నం చంద్‌తో పాటు పలువురు నాయకులు గ్రామస్థుల పక్షాన నిలిచి ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ కొత్తగా భూములు సాగు చేయడం లేదని, గతంలో ఎప్పుడో దున్నిన భూమికి సంబంధించి ఆ ట్రాక్టర్‌లు ఎవరవనే దానిపై అటవీ అధికారులు నానా హంగామా సృష్టించారని, గ్రామంలోనిమహిళలు, పురుషులను బెదిరించారని దీనిపై ఎమ్మెల్యే వివేక్ స్పందించి అధికారుల తీరుపై విచారణ జరిపి గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత

భీమారం, మే 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు భీమారం ఎస్‌ఐ శ్వేత తెలిపారు. భీమారంలోని శేఖర్ కిరాణం ముందు మట్టిని తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు అనపర్తి మధుకర్, ఇస్లావత్ శివరాంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


లింగాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని చోర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రకాష్(40) అనే వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. లింగాపూర్ ఇన్‌చార్జి ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్ ద్విచక్రవాహనంపై బుధవారం లింగాపూర్ నుంచి చోర్‌పల్లి వైపు వెళుతున్నాడు. రావునూర్ గ్రామ సమీపంలో ఆత్రం భీంరావు అనే యువకుడు తన చేను నుంచి ఇంటికి కాలినడకన వెళుతుండగా బైక్‌తో ప్రకాష్ ఢీకొట్టాడు. రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. గ్రామస్థులు 108కు సమాచారం అందించారు. గాయపడిన ప్రకాష్ ను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ప్రకాశ్ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

సిర్పూర్(టి), మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్గా షరీఫ్‌లో హజరత్ సయ్యద్ తాలీబ్ అలీషా బాబా ఉర్సు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దర్గాలో బాబా సమాధిపై గంధం చెక్కతో తయారు చేసి పూల చాదర్‌ను సమర్పించారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు భాజాభజంత్రీలతో సందల్‌ను తీసుకు వచ్చారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ ఆధ్వర్యంలో సీఐ రమేష్, ఎస్సై కమలాకర్‌తో పాటు 50 పోలీసు సిబ్బందితో దర్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒక్క గ్రామం నాలుగు పేర్లు

- రెవెన్యూ ప్రకారం చిత్తగూడ
- ఐటీడీఏ రికార్డుల్లో గోండ్‌గూడ(డి)
- గ్రామస్థులు పిలిచే పేర్లు గోర్యగూడ, దేవాపూర్ గోండ్‌గూడ



చిత్తగూడ గ్రామం

కెరమెరి, మే 8 (ఆంధ్రజ్యోతి): సర్వ సాధారణంగా గ్రామానికి పేరు ఒకటే ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండు పేర్లు కూడా ఉండొచ్చు. కానీ మండలంలోని ఓ గ్రామానికి మాత్రం నాలుగు పేర్లు ఉన్నాయి. మండలంలోని తుమ్మగూడ గ్రామ పంచాయతీలో ఉన్న గ్రామంలో సుమారు 22కుటుంబాలు, 110వరకు జనాభా నివసిస్తున్నారు. ఈ గిరిజన పల్లెకు నాలుగు పేర్లు ఉన్నాయి చిత్తగూడ, గోండ్‌గూడ(డి), గోర్యగూడ, దేవాపూర్ గోండ్‌గూడగా ఈ గ్రామాన్ని నాలుగు పేర్లతో పిలుస్తు న్నారు. రెవెన్యూ రికార్డుల పరంగా చిత్తగూడగా పేరున్నది. కాగా ఐటీడీఏ రికార్డుల్లో గోండ్‌గూడ (డి)గా నమోదై ఉంది. కాగా ఈ ప్రాంతా నికి చెందిన వారు గోర్యగూడ, దేవాపూర్ గోండ్ గూడగా పిలుస్తున్నారు. 70ఏళ్ల చరిత్రగల ఈ ఆదివాసీ గ్రామానికి మొదటినుంచి ఎన్నోరకాల పేర్లు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఈ నాలుగు పేర్లతో పిలుస్తుండడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

● అధికారులు తికమక..

ఇక్కడికి వచ్చే నూతన అధికారులు మాత్రం తికమక పడుతున్నారు. ఈ గ్రామానికి చెందిన వివరాలు గ్రామం పేరు అడిగినట్లయితే ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతుంటారు. ఒకరు చిత్తగూడ, మరొకరు గోర్యగూడ, మరకొందరు గోండ్‌గూడగా చెబుతున్నారు. ఈ గ్రామంలో అందరు ఆదివాసీ గోండ్ తెగ వారే నివసిస్తున్నారు. అందరు ఒకరికొకరు సమీప బంధువులు కావడం.. నేటికి ఏ గొడవలు లేకుండా కలిసికట్టుగా.. ఐకమత్యం గా ఉండడం వీరి ప్రత్యేకత.

చిత్తగూడ అనే పిలుస్తాం..



ఏడు దశాబ్దాల చరిత్రగల మా గ్రామాన్ని చిత్తగూడ గానే పిలుస్తాం. ఇతర గ్రామస్థులు మీ ఊరి పేరెంటి అని అడుగుతుంటే మాకు ఇబ్బందిగా ఉంటుంది. సుమారు 30సంవత్సరాల నుంచి మా గ్రామాన్ని నాలు గు పేర్లతో పిలుస్తున్నారు. కానీ గ్రామస్థులం దరూ చిత్త గూడ అనే పిలుస్తారు. ఇతరులకు చిత్తగూడ అనే చెబుతాం.

- జంగుపటేల్, గ్రామస్థుడు

అందరూ బంధువులే..



మా గ్రామంలో ఉన్న వారందరూ ఒకరికొకరు బంధువులే. అందరం ఒకే కుటుంబంలా కలిసి మెలిసి ఉంటూ గ్రామానికి చెందిన నిర్ణయాలు కలిసి తీసు కుంటాం. ఇప్పటి వరకు గ్రామంలో ఎలాంటి గొడవలు జరగలేదు. మా గ్రామానికి నాలుగు పేర్లు ఉండడం మా గ్రామ ప్రత్యేకత. మరి ఇతర గ్రామానికి ఒకటి లేదా రెండు పేర్లు మాత్రమే ఉంటాయి. నాలుగు పేర్లు ఉండడం వల్లే మా గ్రామానికి ప్రత్యేకత లభించింది.

- శ్యాంరావు, గ్రామస్థుడు

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి..

● డాక్టర్ అవినాష్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : వేసవిలో ఎండ దెబ్బ బారిన పడకుండా ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్ : వేసవిలో ఎండదెబ్బ బారిన పడకుండా ప్రజలు తప్పనిసరిగా జాగ్ర త్తలు తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పు డు టోపీలు, రుమాలు ధరించాలి. వెంట నీటిని తీసుకు వెళ్లాలి.

ఆంధ్రజ్యోతి : వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

డాక్టర్ : ఎండల తీవ్రతకు బయట తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వడదెబ్బ తగిలినట్లయితే శరీరం పూర్తిగా నీరసించి లేవలేని పరిస్థితుల్లో ఉంటుంది. వడదెబ్బ లక్షణాలు కలిగిన వ్యక్తికి పూర్తి స్థాయిలో గాలి తగిలేలా చూడాలని వెంటనే సమీప ఆసుపత్రులకు తీసుకు వెళ్లి చికిత్సలు అందించాలి.

ఆంధ్రజ్యోతి : డీహైడ్రేషన్ కాకుండా ఏం చర్యలు తీసుకోవాలి?

డాక్టర్ : ఎండల వేళ డీహైడ్రేషన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తరుచూ మంచినీరు తాగాలి. నిమ్మ కాయ నీరు, మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం వేళ బయట తిరగకుండా ఉంటేనే మంచిది.

- బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే కేటాయిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో గల బజార్‌వాడిలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు గల దరఖాస్తుదారులు సాహెరాబేగం ఇంటిని గురువారం సందర్శించారు. దరఖాస్తుదారు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హత గల లబ్ధిదారులకు సొంత ఇంటి స్థలం కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల లోపు ఇంటినిర్మాణం చేపట్టాలని తెలిపారు. లబ్ధిదారులు తమ ఇళ్ల తామే నిర్మించుకోవాలన్నారు. పనులు పూర్తయిన ప్రకారంగా నిధులు మంజూరవుతాయని తెలిపారు. జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు మాత్రమే ఉండాలని పరిశీలన అధికారి రాజ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి

సిర్పూర్(యు)/లింగాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని రైతులు భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్లు ఉదయ్‌కుమార్, పెద్ది రాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విరసత్‌తో పాటు ఇతర భూ సమస్యలు ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని వారు సూచించారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల యజమాన్యం అధిక ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తుందని, చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు ఆర్డీవో లోకేశ్వర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని యజమాన్యం అదనంగా అటెండెన్స్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తోందని చెప్పారు. లేదంటే హాల్ టికెట్లు ఇవ్వమని ఒత్తిడికి గురి చేస్తుందన్నారు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రీతి మండల్, జయ, మధులిక, విష్ణుప్రియ, రిజ్వాన, మహేందర్, శ్రీకాంత్, మనిషా పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

చింతలమానేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ భూ సమస్యల ను పరిష్కరించాలని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ప్రేంకుమార్, కరుణ కుటుంబ సభ్యులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి సమస్యను విన్నవించారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం వేయొద్దు

సిర్పూర్(టి), మే 8 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం పెద్దబండ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న భీమన్న ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం పడవేయ కూడదని అటవీ క్షేత్రాధికారి ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. గురువారం ఆలయ సమీపంలో భక్తులు పడవేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లాసులు, ప్లేట్లు, మద్యం బాటిళ్లు సేకరించి కాల్చి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఆలయ సమీ పంలో ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లాసులు, ప్లేట్లు, మద్యం బాటిళ్లు పడవేయడంతో అపరిశు భ్రంగా మారుతుందన్నారు. అడవికి నిప్పు పెట్టడం, అటవీ జంతువులకు హాని కలిగిస్తే చర్యలు తీసుకుంటామని, భీమన్న ఆలయ కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్వో శ్రీధరచారి, ప్రవీణ్‌కుమార్, ఎఫ్ఎస్ఓలు మోహన్ రావు, ప్రసాద్, ఎఫ్‌బీఓలు మల్లికార్జున్, హబీబ్, వాచర్లు అజంత్, జాకీర్, భీంరావు, డ్రైవర్ హబీబ్‌లు పాల్గొన్నారు.



ఆలయ పరిసరాల్లో చెత్తను కాల్చివేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఒకరి రిమాండ్

బెజ్జూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని పెద్దసిద్దాపూర్ గ్రామానికి చెందిన మెస్రం వంకర్ అనే వ్యక్తిని గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. పెద్దసిద్దాపూర్ గ్రామ సమీపంలో అడవిని నరికి ఎకరం పావు భూమిలో పోడు చేస్తుండడంతో విచారణ చేపట్టి కేసు నమోదు చేశామని తెలిపారు.

నాటు సారా స్వాధీనం

బెజ్జూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిగూడ గ్రామంలోని కిరాణ దుకాణంలో 350 కిలోల బెల్లం, 30 కిలోల పటికతో పాటు 10 లీటర్ల నాటు సారా స్వాధీన పర్చుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. దాడుల్లో ఎస్సైలు లోభానంద్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

దహెగాం, మే 8(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురికి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి నిందితుల నుంచి రూ.1250 నగదు స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనలు పాటించాలి

కెరమెరి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు తమ పరిధిలోనే చికిత్సలు చేయాలని ఎస్సై మధుకర్ అన్నారు. స్థానికంగా గురువారం ఆర్‌ఎంపీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని సూచించారు. పరిమితికి మించి వైద్యం చేయకూడదన్నారు. అలాగే మారుమూల గ్రామాల్లో వైద్యం చేస్తున్న క్రమంలో కొత్త వ్యక్తులకు చికిత్సలు చేసినట్లయితే తమకు సమాచారం అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్, మోతిరాం, దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బలోపేతానికి చర్యలు

రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో తీర్మానం



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం తీర్మానించింది. హైదరాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మేడే సందర్భంగా సింగరేణి కార్మికులకు పెద్ద ఎత్తున శ్రమశక్తి అవార్డులు రావడానికి కృషి చేసిన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రాతినిధ్య సంఘంగా ప్రభుత్వంతో కలిసి చేపట్టిన కార్యక్రమాలు, చేయాల్సిన కార్యాచరణపై సమీక్ష నిర్వహించి, భవిషత్తు కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. యూనియన్ బలోపేతానికి రంగాల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధికారులతో చర్చలు జరపాలని తీర్మానించారు. ప్రతీ ఏరియాలో బ్రాంచ్ కమిటీల నిర్మాణాన్ని పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయిం చారు. అనంతరం యూనియన్ నాయకులు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి కార్మిక సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపల్లి సమ్మయ్య, జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శులు వికాస్ కుమార్ యాదవ్, రాజేందర్, అక్రమ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేందర్, మహిళా అధ్యక్షురాలు శేషారత్నం, రీజనల్ ప్రధాన కార్యదర్శి అల్బర్ట్, ఏరియా ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులు పోరాడాలి

మందమర్రి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అవలంబిస్తున్న విధానాలపై కార్మికులు పోరాడాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీచైర్మన్ కాంపెల్లి సమ్మయ్య అన్నారు. మందమర్రిలో గురువారం విలేకరులతో మా ట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభు త్వం చట్టాలను ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా వ్యవహరిస్తోం దన్నారు. గతంలో రైతులకు వ్యతిరేకంగా రైతు చట్టాలను తీసుకువచ్చిందన్నారు. రైతు సంఘాలు, రైతులు ఢిల్లీని దిగ్బంధనం చేశారని, చట్టాలు రద్దయ్యే వరకు పోరాడారని గుర్తు చేశారు. సింగరేణిలో కూడా కార్మికులు పోరాటాలకు కలిసి రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికు లంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్ పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేయొద్దు

రెబ్బెన, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చట్టాలను మార్చుతూ కార్మికులకు అన్యాయం చేయొద్దని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సమ్మె నోటీసులను పీహెచ్‌సీ డాక్టర్ సుజిత్‌కు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రమీల, సిబ్బంది తులసి, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతపై జీఎం సమీక్ష

శ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గనులు, విభాగాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల భద్రత ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏపీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, ఎంవీటీసీ మేనేజర్ కె రామారావు, ఏరి యా సర్వే అధికారి నర్సింగరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి పాల్గొన్నారు.



విలీనసభను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్(ఎస్‌సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్‌టీయూ) విలీన సభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల యూనియన్ రెండుగా చీలిపోయిందని, ఇప్పుడు రెండు సంఘా లు ఒక్కటవుతున్నాయని తెలిపారు. ఈ నెల 11న విలీన సభ భూపాలపల్లిలో నిర్వహిం చనున్నామని చెప్పారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదగిరి, శంకర్, సుధాకర్, రాంబాబు, సురేష్, నగేష్, విజేందర్, రాకేష్, సమ్మయ్య, శారద, మల్లేశ్వరి, శిరీష, కవిత, తదితరులు పాల్గొన్నారు.


సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్ కోరారు. ఏరియాలోని కేకే 5 గని వద్ద గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావాలని చూస్తుందని మండిపడ్డారు. ఇప్పటికే కార్పొరేట్ భక్తులకు బొగ్గు బావులను అప్పనంగా అప్పగిస్తూ ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందన్నారు. కొత్త గనులను ఏర్పాటు చేయకుండా ఉన్న వాటిని ప్రైవేటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో బ్రాంచి సెక్రెటరీ సోముశెట్టి రాజేషం, ఏరియా నాయకులు బానయ్య, దినేష్, నాగేశ్వర్‌రావు, విక్రంసింగ్, ప్రేంలాల్, సంతు తదితరులు పాల్గొన్నారు.

- కుర్రెగఢ్ ఘటనకు రేపటితో 15 ఏళ్లు
- ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోని పునరావాస కాలనీ
- హామీల అమలులో అధికారుల నిర్లక్ష్యం
- అవస్థల్లో బాధిత కుటుంబాలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న కుర్రెగఢ్ పునరావాసం కాలనీ వాసులు

కన్నీటి చావులు

కాసిపేట, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ఆకలి చావుల ఘటనలు వినేఉంటాము. కానీ తాగునీరు లేక ఏడుగురు చనిపోయిన సంఘటన కాసిపేట మండలం కుర్రెగడ్‌లో చోటు చేసుకుంది. 15ఏళ్ల క్రితం జ రిగిన ఈ సంఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచ లనం సృష్టించింది. ఆనాటి పరిస్థితులను తలుచుకుంటూ ఇప్పటికీ పున రావాస కాలనీవాసులు ఉలిక్కి పడుతూనే ఉన్నారు. 2010లో జరిగిన ఈ విషాదకర ఘటనలో ఏడుగురితో పాటు 30కిపైగా మూగజీవాలు మృత్యువాతకు గురయ్యారు. 2010 మే7న కుర్రెగడ్‌లో జరిగిన ఘటన మూడు రోజుల తరువాత బాహ్య ప్రపంచానికి తెలిసింది. బెల్లంపల్లి అప్పటి ఎమ్మెల్యే దివంగత నేత గుండా మల్లేశ్ చొరవతో ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ, వైద్య బృందాలు, ప్రజా ప్రతిని ధులు నీళ్లట్యాంకర్, మందుల కిట్లు ఆహార పదార్థాలు తీసుకొని ట్రాక్టర్లసాయంతో గుట్టపైకి వెళ్లారు. ముందుగా ఆహారం, మంచీనీళ్లు అందించి అత్యవసరంగా వైద్యసేవలందించారు. అందరినీ ఒకచోటకు చేర్చి జరిగిన సంఘటనపై అధికారులు వివరాలు అడిగితెలు సుకున్నారు. వెంటనే 18 కుటుంబాలను మల్కపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు తరలించి తాత్కా లికంగా ఆశ్రయం కల్పించారు. వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో పునరా వాస కాలనీ ఏర్పాటు చేశారు.



కుర్రెగఢ్ పునరావాస కాలనీకి వెళ్లే దారి

పురోగతి లేని పునరావాస కాలనీ...

15ఏళ్ల క్రితం వెంకటాపూర్ శివారు ప్రాంతంలో ఏ ర్పాటు చేసిన కుర్రెగడ్ పునరవాస కాలనీలో ఎలాంటి పురోగతి లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడం వర్షాకాలంలో వాగులు ఉప్పొంగితే బయట ప్రపం చానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతర్గత రోడ్ల నిర్మాణం సక్రమంగా లేక వర్షం నీరు ఇండ్లలో కి చేరి బురదమయంగా మారుతోంది. కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నెరవేరని హామీలు...

పునరవాసకాలనీకి తీసుకొచ్చినప్పుడు అధికారులు ప్రతికుటుంబానికి మూడెకరాల సాగు భూమితో పాటు రెండు జతల ఎద్దులను ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ నేడు కేవలం 8కుటుంబాలకు మాత్రమే మూడు ఎకరాలభూమి ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. గతంలో కుర్రెగడ్ లో ఉన్నప్పుడు పది ఎకరాల సాగుభూమి ఉండేది. మైదాన ప్రాంతానికి వచ్చిన తరువాత సాగు చేసేందుకు భూమిలేక పని చేసేందుకు ఉపాధిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్రెగడ్ లో ఉన్న 300 ఎకరాల సాగు భూమి అటవీ అధికారులు స్వాధీనం చేసు కొని మొక్కలు నాటారు. రెండు చోట్ల భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటి కైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి హామీలను నెరవేర్చాలని కోరుతున్నారు.

సంఘటన జరిగింది ఇలా...

కాసిపేట మండలం సోనాపూర్ పంచాయతీ పరిధిలోని దట్టమైన గుట్టలపైన వ్యవయాసాన్ని నమ్ముకొని 18 గిరిజన కుటుంబాలు కుర్రెగడ్‌లో నివాసం ఉండేవి. 2010 ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. గుట్ట పై ఉన్న చేదబావులు, నీటికుంటలు సైతం ఆ ఎండ వేడికి ఎండిపోయాయి.

దీంతో తాగునీటికి తీవ్ర కొరత ఏ ర్పడింది. గిరిజన కుటుంబాలు రెండు కిలోమీటర్లు నడిచి గుట్టకిందకి వచ్చి నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చింది. రెండు రోజుల వ్యవధిలోనే తాగునీరు దొరకక కుర్సంగ పాల్కుబాయి(29), ఆత్రం లచ్చుబాయి(25), వల్క శేఖర్(28), కుర్సింగ మోహన్(6), కుర్సింగ నేచుబాయి(41), ఏడాది పాప వల్కలక్ష్మీ, కుర్సింగా కిష్టుబాయి(23) ఇళ్లల్లోనే మృతి చెందారు. వీళ్లతో పాటు చెరు వులు కుంటల్లో నీళ్లలేక 30కిపైగా మూగజీవాలు మృత్యు వాత పడ్డాయి. తిర్యాని మండలానికి అతిసమీపంలో ఉండడంతో అటుగా వెళ్లిన పశువుల కాపరులు చూసి సమీప గ్రామ ప్రజలకు సమాచారం అందించారు. దీంతో విషయం వెలుగులోకి రావడంతో ఐటీడీఏ అధికారులు, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు ట్యాంకర్లతో మంచినీళ్ల ఆహారంతో పాటు వైద్యబృందాలను వెంట తీసుకెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించారు. పరిస్థితిని సమీక్షించిన అధికారులు 18కుటుంబాలను మల్కపల్లి ఆశ్రమ పాఠశాలకు తరలించి తాత్కా లిక ఆశ్రయం కల్పించారు.

పని లేదు పింఛన్ లేదు...

- సిడాం గిరిజుభాయి



మా పటేల్ చనిపోయి రెండేండ్లు అవుతుంది. చే సేందుకు పని లేదు. ఉండేందుకు ఇల్లు లేదు. బతుకే కష్టంగా మారింది. ప్రభుత్వం పింఛన్ ఇస్తామన్నారు. కాని ఇప్పటి వరకు ఇవ్వలేదు. మా పిల్లలకు రేషన్ కార్డు లేదు. అన్ని కల్పించి ఆదుకోవాలి

ఇచ్చిన హామీలు నెరవేర్చండి...

- కుర్సింగ సురేందర్



కుర్రెగఢ్ నుంచి అధికారులు తీసు కొచ్చి నప్పుడు అన్ని విధాలుగా ఆ దుకుంటామన్నారు. కాని ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఇక్కడికి వ చ్చి 15ఏళ్లు అవుతుంది. సాగు భూ మి లేదు. ఉపాధి లేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉపాధి అవకా శాలు కల్పించండి.

క'న్నీటి' చావులు..

(5వ పేజీ తరువాయి)

ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు అక్కడి అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆదివాసీ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. గ్రామాలను తరలించకపోగా, అభివృద్ధి కూడా చేపట్టక పోవడంతో ఆది వాసీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలుగా గ్రామాల్లో రహదారుల సౌకర్యం లేకపోవడమే గాక విద్య, వైద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పోడు భూముల్లో సాగుచేసి పండించిన పంటను విక్రయించేందుకు సైతం రవాణా సౌకర్యం లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్సకు వెళ్లాలంటే కూడా సరైన రవాణా మార్గాలు అందు బాటులో లేవు. జన్నారం మండలంలోని దొంగపెల్లి గ్రామస్థులు మైదాన ప్రాంతానికి చేరుకోవాలంటే కనీసం 18 కిలో మీటర్లమేర నడవాల్సి ఉంటుంది. నిధులు మంజూరు కాగానే గ్రామాల తరలింపు ప్రక్రియ నిలిచిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

● అటవీ అధికారుల ప్రకటనతో...

కవ్వాల్ పులుల అభయారణ్యంలోని నిర్మల్ జిల్లా మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు పునరావాసం కల్పించగా, జన్నారం మండలంలోని గ్రామాలను కూడా మరికొద్ది రోజుల్లో తరలించనున్నట్లు పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ గతేడాది ప్రక టిం చారు. ఒక్కో కుటుంబానికి కేంద్రం నిబంధనల ప్రకారం రూ. 15 లక్షల పరిహారంతో పాటు 333 చదరపు గజాల్లో ఇల్లు, 2.81 ఎకరాల సాగు భూమిని అందజేయాల్సి ఉంది. అలాగే పునరావాస కాలనీల్లో సామాజిక ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. అధికారుల ప్రకటనతో ఇంతకాలం కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డ అడవి బిడ్డలు, త్వరలోనే మైదాన ప్రాంతంలోని పునరావాస కేంద్రాలకు తరలివెళ్లనున్నామని సంతోషించారు. అయితే అధికారులు ప్రకటించి ఏడాది గడుస్తున్నా గ్రామాలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలంతా ఉసూరు మంటూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల తరలింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాల పద్ధతిన ఖర్చులు భరించాల్సి ఉంది. కేంద్రం నుంచి నిధులు సిద్ధంగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పనులు కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా జాబితాను రూపొందిస్తున్నామని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కన్నాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. గ్రామస్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదలందరికీ వస్తాయన్నారు. జాబితాను క్షేత్రస్థాయి పరిశీలిస్తామని కుటుంబాల స్థితిగతులు తెలుసుకుంటామన్నారు. ఎంపీడీవో మహేందర్, నాయకులు కారుకూరి రాంచందర్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

గర్మిళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత ఆర్మీకి అభినందనలు తెలుపుతూ గురువారం మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పహెల్గాం దాడికి ప్రతికార చర్యలో భాగంగా పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను భారత ఆర్మీ ధ్వంసం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం

గర్మిళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెనిరిడునెంట్ జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని గురువారం మంచిర్యాలోని ఆనంద నిలయం ఆశ్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్‌చేశారు. వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించగా డాక్టర్‌లు చంద్రదత్, సుగుణాకర్‌రెడ్డి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. అనంతరం వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, శంకర్ వర్మ, సత్యనారాయణ రావు, రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి కృషి

భీమిని, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కారమే ప్రధాన ధ్యేయమని తహసీల్దార్ బికర్ణ దాస్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నగుడిపేట గ్రామంలో సర్వే నంబరు 193 భై 191, 178, 166 భూములను గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గతంలో ప్రజా పాలన దరఖాస్తుల్లో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కిరం చేస్తున్నామన్నారు. భూసమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

నస్పూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బా విద్యాలయంలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటి బచావో, బేటి పడావో, బాల్య వివాహ నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 1930, సఖీ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 181 తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు విజయ, ఫైనాన్స్ లీటరసీ లిప్సిక, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

లక్సెట్టిపేట, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంతి భవనంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ట్రాన్స్‌పోర్టు మెంబర్ అంకతి శ్రీనివాస్, నాయకులు చింత అశోక్, పూర్ణచందర్‌రావు, బియ్యాల తిరుపతి, సత్తయ్య, పాల్గొన్నారు.

ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దు

కాసిపేట, మే8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళా రులకు అమ్మి మోసపోవద్దని డీడీఎం అబ్దుల్ రవూఫ్ అన్నారు. గురు వారం బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో ప్రారంభిం చిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి హాజరై మాట్లాడారు. కొనుగోలు కేం ద్రం రైతులకు ప్రభుత్వానికి మధ్యవర్తిగా ఉండి ధాన్యం కొనుగోలు చే స్తోందన్నారు. రైతులు ఎవరు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయ న సూచించారు. నేరుగా ప్రభుత్వం నుంచి మంచి ధరలు పొంది రైతు లు ఆర్థికంగా బలపడాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచ డం లో రైతు ఉత్పత్తి దారుల కంపెనీ క్రియాశీలపాత్ర పోషిస్తుందన్నారు. అం దుకు ప్రతి రైతు కూడ సభ్యత్వం కలిగి ఉండాలని సూచించారు. రైతు లందరూ సకాలంలో వడ్లను ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకు రా వాలని తహసీల్దార్ భోజన్న సూచించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. రైతు ఉత్పత్తి దారుల కంపెనీ చైర్మన్ ఎంబడి కిషన్ మాట్లాడుతూ కంపెనీ రైతుల సంక్షేమం కోసం పని చేస్తోంది. నాబార్డు వారి సహకారంతో 500 మంది రైతుల భాగస్వామ్యంతో కొనసాగుతుం ది. 2019లో ప్రారంభమైన ఈ సంస్థ సమర్థవంతంగా పని చేస్తుంది. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే వడ్లను అమ్ముకోవాలని ఆ యన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వ్యవసాయా ధికారి ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ సిడాం జంగు, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, సీఈవో కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ర త్నం ప్రదీప్, కంపెనీ డైరెక్టర్లు కళావతి, ముత్తె భానయ్య, మల్లేశ్, జనార్ధన్, బక్కన్న పాల్గొన్నారు.



మల్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ భోజన్న

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట,మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అ బ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొ దటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక గ్రూపునకు 40 మంది విద్యార్థుల చొ ప్పున 160 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప దో తరగతిలో విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధా రంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. దర ఖాస్తు చేసేందుకు ఈ నెల 20న ముగుస్తుంది. 26న ఎంపిక జాబితా విడుదల చేసి 27 నుంచి 31 తేదీ వరకు ధృవపత్రాల పరిశీలన చేసి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. బాలికలకు వంద మంది విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

పంటమార్పిడితోనే సుస్థిర ఆదాయం

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ

నెన్నెల, మే 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తూ, సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞన కేంద్రం ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ కోట శివకృష్ణ అన్నారు. మండలంలోని కర్జీ గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి ఒకే పంట సాగు చేస్తే ఆశించిన దిగుబడులు రావన్నారు. వరి, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలు కూడా సాగు చేయాలని సూచించారు. సాగు లాభసాటిగా మారేందుకు ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. అధిక రసాయణ ఎరువుల వాడకం తగ్గించి వృధా ఖర్చులు అరికట్టాలన్నారు. మోతాదుకు మించి రసాయనాలు వాడితే భూ భౌతికస్థితి దెబ్బతిని మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుందన్నారు. విత్తనోత్పత్తి, సస్యరక్షణ చర్యలు, సాగు నీటి నిర్వహణ, ఎరువుల, విత్తనాల రసీదులు బద్రపర్చుకోవడం సహా అనేక అంశాలపై అవగాహన కల్పించారు. విత్తనాలు ఎలా ఎంపిక చేసుకోవాలో వివరించారు. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, యాంత్రీకరణ, సమీకృత, సేంద్రీయ, ప్ర కృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఫార్మర్ ఐడీ గూర్చి భీమిని ఏడీఏ సురేఖ వివరించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, నాగరాజు, భీమిని ఏడీఏ సురేఖ, మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన, ఏఈవో రామ్‌చందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ కోట శివకృష్ణ

గ్రామీణ ప్రజల సమస్యలను పరిష్కరించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

నెన్నెల, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ప్రజల జీవన స్థితిగతులను అర్థం చేసుకునేందుకు వేసవి సెలవుల్లో సంఘం ఆధ్వర్యంలో చేపట్టే గ్రామాలకు తరలిరండి కార్యక్రమాన్ని గురువారం నందులపల్లి, నెన్నెల గ్రామాల్లో నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పల్లెల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికి రోడ్డు రవాణా సౌకర్యం లేని గ్రామాలు ఉన్నాయన్నారు. భూమి లేని నిరు పేదలకు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు దుర్గం బ్రహ్మానందం, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు దీపాలక్ష్మి, ఏఐకే ఎంఎస్ జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి పాల్గొన్నారు.



నెన్నెలలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని..

అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు

భీమిని, మే 8 (ఆంధ్రజ్యోతి) :అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని భీమిని మండలంలోని కేస్లాపూర్ గ్రామ పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో విచారణకు వచ్చిన ఎంపీడీవో గంగామోహన్ గ్రామ కార్యదర్శి శోభన్‌బాబులను గ్రామస్థులు గురువారం అడ్డుకోని వాగ్వాదం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 120 కుటుంబాలు ఉండగా ఒకటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారంటూ ఆరోపించారు. గ్రామంలో 20 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్నారు. అధికారులు స్పందించి నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

బెల్లంపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రాష్ట్ర శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో ఈ నెల 10, 11న నిర్వహిస్తున్నామని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ఆలిండియా లాయర్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల హేమాజీ అన్నారు. సుచిత్ర హోటల్‌లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని కొత్త చట్టాలు వృత్తిలో న్యాయవాదులు రాణించడానికి అనుభవజ్ఞులైన జడ్జిలు, న్యాయవాదులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర సమాచారం కోసం 9866240402లో సంప్రదించాలన్నారు.

తెలంగాణలో టీడీపీదే అధికారం

బెల్లంపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు సంపత్, భార్గవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మండల కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులను సన్మానించారు. నాయకులు మణిరాంసింగ్, జీవ రత్నం, అంబాల మహేందర్, దాసరి శ్రీనివాస్, మల్లేశ్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాసిపేట మే8 (ఆంధ్రజ్యోతి): మల్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. ప్రారంభానికి నోచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అకాల వర్షాలతో భయాందోళనకు గురైన రైతులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

- హాజరైన జీఎం దంపతులు
- తరలి వచ్చిన భక్తులు

మందమర్రిటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటే శ్వర ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కల్యాణం జరిగింది. ముందుగా శ్రీనివాసుని అలివేలుమంగ విగ్ర హాలను ఊరేగింపుగా మండపానికి తోడు కొని వచ్చారు. పెళ్లి పెద్దలుగా జీఎం దంపతులు హాజరయ్యారు. అంతకు ముందు స్వామి వారికి పట్టు వస్త్రాలను జీఎం సమర్పించారు. వేద పండి తులు కల్యాణాన్ని జరిపించారు. అంతకు ముందు ఆలయంలో హోమం నిర్వహించారు. అర్చకులు అనంత చార్యులు, నర్సింహ చార్యులు మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలు వారం పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంకాలం వేళల్లో హాజరయ్యే భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్న దానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నా రు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగుతో పాటు అంజనిపుత్ర ఎస్టేట్స్ పిల్లి రవి దంపతులు పాల్గొన్నారు.



మందమర్రి వేంకటేశ్వర ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కలమడుగు గ్రామంలో పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తుందన్నారు. వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహాను కలిసి డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరామని, త్వరలోనే డయాలసిస్ సెంటర్ రాబోతోందన్నారు. అనంతరం కలమడుగు గ్రామంలోని బీరయ్య, శ్రీనివాస్‌లకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, వైద్యులు ఉమశ్రీ, గంగాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు ఇసాక్, రాజశేఖర్, మోహన్‌రెడ్డి, శంకరయ్య, రమేష్, ఇందయ్య పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం ద్వారా అర్హులకే రుణం

- అదనపు కలెక్టర్ మోతిలాల్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్

నస్పూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులైన వారికి రుణ సౌకర్యం కల్పిస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరంగా మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులు ఆర్థిక రుణ సదుపాయం కల్పించి వారు ఉపాధి పొందే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. కాసిపేట మండలాన్ని ఎంపిక చేసుకుని వంద శాతం అక్షరాస్యత సాధించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ ఉప పాలనాధికారి చంద్రకళ, షెడ్యూల్డ్ కులాల కార్పోరేషన్ ఈడి చాతరాజుల దుర్గాప్రసాద్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నస్పూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అకాడమీ ఫర్ సిల్క్ అండ్ నాలెడ్జ్ డిపార్టుమెంట్ (టాస్క్) ద్వారా ఉపాధి సామర్థ్యాన్ని పెంచే నైపుణ్య శిక్షణను అందిస్తున్నామని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో టాస్క్ శిక్షణ కేంద్రం ద్వారా శిక్షణ పొందుతున్న అభ్యర్థుల కేంద్రాన్ని టాస్క్ అధికారి సాయి కుమార్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజుల పాటు అర్హత గల యువతకు పరిశ్రమ సంబందిత నైపుణ్యాలను అందించి వారి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుతామన్నారు. మొదటి విడతలో 40 మంవది నిరుద్యోగ యవత శిక్షణ పొందుతు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాస్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందిపుచ్చుకోవాలి

- డీఈవో యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలక్రైం, మే8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కార్యక్రమాలను ప్రతి విద్యార్థి పూర్తి స్థాయిలో వినియోగించుకొని గుణాత్మక విద్యను అంది పుచ్చుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. ప్రధానోపాధ్యాయులకు జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించే ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి గుణాత్మక విద్యను, నాణ్యమైన విద్యను, డిజిటల్ విద్యను అం దించడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఎలాంటి భయం ఒత్తిడి లేకుండా విద్య నేర్చుకోవడం కోసం అవకాశం కల్పించడానికి మండల స్థాయిలో స్కూల్ కంపోండ్ స్థాయిలో అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. యుడైస్ ప్లస్, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు కృత్రిమ మేధ తరగతులు, సాంకేతిక విద్య అమలు, సమయానికి టెక్స్‌బుక్స్, వర్క్‌బుక్స్ యూనిఫాంలు అన్ని అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోదర, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, మహేశ్వర్‌రెడ్డి, రాజుకుమార్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

భీమారం, మే 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం భీమారం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు ప్రజలు, దుకాణాల యాజమానులు వాడవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడిన వారికి జరిమానాలు విధించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇండ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాల ని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

మంచిర్యాలక్రైం,మే8(ఆంధ్రజ్యోతి): డిప్లోమా ఇన్ ఎలంమెటరీ ఎడ్యూకేషన్ (డీ.ఈఎల్, ఈడీ) ఇన్ పీస్‌ఫుల్ ఎడ్యూకేషన్ కోర్సుల్లో 25, 27కు సంబంధించి బ్యాచ్ ప్రవేశాల కోసం డీసెట్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని డీఈవో యాదయ్య తెలిపారు. దరఖాస్తు సమర్పణకు ఈ నెల 15 వరకు గడువు ఉందని ఇంటర్ లేద తత్సమాన పరీక్షలో 50శాతం మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ వికలాంగులకు 45శాతం మార్కులు వచ్చిన వారు దరఖాస్తులకు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలని తెలిపారు. తెలుగు, ఉర్దూ, మాధ్యమాల్లో డీసెట్ రాత పరీక్షలను తేదీ 25న నిర్వహిస్తారని ఈనెల 17, 18తేదీల్లో దరఖాస్తు చేసిన అభ్య ర్థులకు సవరణకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులను తొలగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులను తొలగించాలని గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. బెల్లంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకమిటీ వారు అనర్హులను జాబితాలో చేర్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్దిదారులను గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఎంపిక చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, సత్తయ్య, గోమాస శ్రీనివాస్, హరిక్రిష్ణ, మోహన్ పాల్గొన్నారు.

పునరావాసానికి ఎంపిక చేసిన జన్నారం మండలంలోని దొంగపల్లి గ్రామం



గ్రామాల తరలింపు ఎప్పుడో..!

- టైగర్ రిజర్వు ఫారెస్ట్ బాధితుల గోడు వినేదెవరు..?
- అడవుల్లో వసతుల్లేక ప్రజల ఇబ్బందులు
- నిర్మల్ జిల్లాలో ఇప్పటికే పూర్తయిన పునరావాసం
- మంచిర్యాల జిల్లాలో ప్రకటనలకే పరిమితం

మంచిర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు పరిధిలో గ్రామాల తరలింపునకు మోక్షం లభించడం లేదు. టైగర్ రిజర్వు ఏరియాలోని గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించాలన్న ప్రతిపాదనలు ఏళ్లు గడుస్తున్నా ఆచరణలోకి రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అడవుల్లో కనీస సౌకర్యాలు కరువై, మైదాన ప్రాంతాలకు తరలించండి మొర్రో....అంటున్నా వారి గోడు వినేవారే కరువయ్యారు. నిర్మల్ జిల్లాలో గ్రామాల తరలింపు ప్రక్రియ పూర్తికాగా, మంచిర్యాల జిల్లాలో మరికొద్ది రోజుల్లో కవ్వాల్ అభయారణ్యంలోని మిగతా గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తామన్న అటవీశాఖ ఉన్నతాధికారుల ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదు. కవ్వాల్ అభయారణ్యం దట్టమైన అటవీ ప్రాంతంకావడం, టైగర్ రిజర్వు ఫారెస్టుగా ప్రకటించడంతో గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించాలని అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేయడం ద్వారా పులులకు ఆప్రాంతంలో ఆవాసంతోపాటు రక్షణ కల్పించేందుకు అటవీశాఖ నిర్ణయించింది. నానాటికి పులుల సంఖ్య తగ్గిపోతుండటంతో దాన్ని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అటవీ క్షేత్రాలను, అ భయారణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా టైగర్‌జో న్‌గా తీర్చిదిద్ది, పులులు, ఇతర వణ్య ప్రాణులకు ఆవాసం కల్పించాలని నిర్ణయించారు.

గ్రామాల తరలింపునకు ఆమోదం...

కవ్వాల్ టైగర్‌జోన్ కోసం సుమారు 15 గ్రామాలను తరలించాలని అటవీశాఖ ఆధ్వర్యంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్‌లోని అల్లీనగర్, దొంగపెల్లి, మల్యాలతోపాటు నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. మొదటి విడుతలో భాగంగా నిర్మల్ జిల్లాలోని మైసంపేట, రాంపూర్ గ్రామాలను తరలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలకు భూ పట్టాల పంపిణీ కూడా చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 15 ల క్షలు, లేదా అదే ప్యాకేజీలో సరిపడా ఇల్లు నిర్మించడం తోపాటు ఉపాధి కల్పించాలని అధికారులు నిర్ణయిం చారు. ఈ మేరకు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గ్రామాలకు కొత్త మద్దిపడగ శివారులో భూములు కేటాయించగా గతేడాది గ్రామాలను అధికారులు పున రావాస కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా జ న్నారం మండలంలోగల అల్లీనగర్, దొంగపెల్లి, మల్యా ల గ్రామాల తరలింపులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు గ్రామాల్లో 265 కుటుంబాలు ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. ఈ కుటుంబాలను మైదాన ప్రాంతానికి తరలిస్తేగానీ కవ్వాల్ టైగర్ రిజర్వులో పులి ఆవాసం ఉండే పరిస్థితి లేదు.

అభివృద్ధికి నోచుకోని ఆదివాసీలు...

కవ్వాల్ టైగర్ జోన్‌లో భాగంగా అధికారులు మైదాన ప్రాంతానికి తరలించే గ్రామాలను ఎంపిక చేయడంతో ఇక్కడ అభివృద్ధి కుంటుపడింది. ఎలాగూ గ్రామాలు తరలిపోతాయనే...

మిగతా 7లో

> **పులులకు శాశ్వత ఆవాసం కోసం...**
>
> పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ఇంద్రావతిలోని తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వు ఫారెస్టులు కవ్వాల్ అభ యారణ్యాన్ని ఆనుకొని ఉండటంతో అక్కడి నుంచి పులులు వచ్చి, పోతూ ఉండటంతో ఇక్కడ వాటికి శాశ్వత ఆవాసం కల్పించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంతో పాటు నిర్మల్ జిల్లాలోని కడెం మండలాన్ని కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. జనసంచారం, అలికిడి ఉంటే పులులు నివాసం ఉండవనే ఉద్దేశ్యంతో కవ్వాల్ అటవీ ప్రాంతంలోని గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలించాలనే నిర్ణయానికి వచ్చారు.

ఆదివాసీ గిరిజనులను చైతన్యపర్చడమే ధ్యేయం

- ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్

జన్నారం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గిరిజనులను అన్ని రంగాల్లో చైతన్యపర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి ముగ్గురు చొప్పున గిరిజన ఆదివాసీల కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణ కార్యక్రమం ఈ నెల 11,12,13 తేదీల్లో మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో నిర్వహించనుండగా జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జీ సుగుణతో కలిసి గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ ఈ శిక్షణతరగతుల కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహరాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు రాష్ట్ర ప్రముఖనేతలు హాజరవుతారన్నారు. దేవంలో గిరిజన ఆదివాసీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఆదివాసీ, గిరి జనులు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు సాధించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన ఆదివాసీల కోసం అనేక చట్టాలను చేసిందన్నారు. జల్ జంగల్, జమీన్ నినాదానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఈ నినాదంతో రాహుల్‌గాంధీ పాదయాత్ర కూడా చేపట్టారన్నారు. కార్యక్ర మంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సింగిల్ విండో చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ నాయకులు ముజాఫర్, మోహ న్‌రెడ్డి, ఇసాక్, రమేష్‌రావు, ఇందయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్

రైతులకు అసౌకర్యం కలగొద్దు : కలెక్టర్



కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, మే 8(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు 500రూపాయల బోనస్ కూడా ఇస్తామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతీ కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీ కేంద్రానికి అవసరం ఉన్నంత మేరకు టార్పాలిన్ కవర్లు, గోనె సంచులు సమకూరుస్తామన్నారు. కేంద్రం నిర్వాహకులు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వాళ్లకు కేటా యించిన రైస్ మిల్స్‌కు కూడా తొందరగానే పంపిస్తామన్నారు. రైతులు ఇచ్చిన ధాన్యానికి తప్పకుండా రశీదును అందించాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట పట్టణంలో నూత నంగా నిర్మాణం చేపడుతున్న 30పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని త్వరత గతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వహకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

జన్నారం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడిరాజన్న డిమాండ్ చేశారు. గురువారం జన్నారంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, దీంతో ఉపాధ్యాయుల భవిష్యత్తు, పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం పదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. పదవతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు ముందున్నా యని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి మరిన్ని చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో నాయకులు రాజేష్ నాయక్, గోపాల్, ప్రభాకర్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, ఇండస్ట్రియల్ సంస్థల అధికారులు, భద్రత అధికారులతో కలిసి సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రధానమైన ప్రాంతాల్లో అప్రమ త్తంగా ఉండాలని భద్రత వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగులు అన్నిశాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చూడాలని, సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతర నిఘా పర్యవేక్షణ చేప ట్టాలన్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించ డానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, కమాండెంట్ ఎస్‌పి రాజు, డిప్యూటి కమాం డెంట్ చందన్ కుమార్ సమత, ఎన్టీపీసీ ఈడి లలిత్ కుమార్, ఆర్‌జీ1ఏ జీఎం రాముడు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మే8(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా పుట్ట గొడుగుల్ల వెలుస్తున్న వాటర్‌ప్లాంట్లపై సంబంధిత అధికాలు చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. గురువారం ఎంసీపీఐయు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండ ఇష్టారీతిన వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తూ నీళ్ల విక్రయిస్తున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా నడుపుతున్న వాటర్ ప్లాంట్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వాటర్‌ప్లాంట్లను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. అధికారులు చర్యలు తీసుకోని యెడల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు.